


sahanamvande.com


సహనం వందే

epaper.sahanamvande.com

హైదరాబాద్ | 16-11-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 195 EDITOR: ROHINI



సీబీఐ ఉచ్చులో జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు



30 మందికి అక్రమ లబ్ధి... 52 లక్షలు చెల్లింపు

- వారిని ఇరికించిన ఆ కీలక అధికారి ఎవరు?
- అధ్యాపక ప్రమోషన్ల వెనుక అసలు దొంగెవరు?
- ఇప్పటికే వేటు వేసినా కుట్రలు చేస్తున్న అధికారి
- ప్రమోషన్ల మాటున నిబంధనల ఉల్లంఘన
- జేఎన్‌టీయూలో బయటపడ్డ చీకటి కోణం!
- సీబీఐ చేతికి కీలక ఆధారాలతో ఫిర్యాదు
- అధికారుల కుట్రకు ప్రొఫెసర్ల బలి
- గత ప్రభుత్వ హయాంలో ఇష్టరాజ్యంగా లూటీ?

ఈ వివాదానికి ప్రధాన కారణం రెండు తేదీల మధ్య ఉన్న వ్యత్యాసం. కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ కింద ఉద్యోగికి ప్రమోషన్ పొందడా నికి అర్హత వచ్చే తేదీ ఒకటి. కొత్త హోదాలో బాధ్యతలు స్వీకరించే తేదీ మరొకటి. ఈ రెండిం టినీ ఒకటిగా పరిగణించి వేతన ప్రయోజనాలు కల్పించడమే ఆడిట్ అభ్యంతరానికి కారణమైంది. ఆడిట్ అధికారులు ప్రస్తావించిన 2001 జూలై 21నాటి జీవో నంబర్ 535 ప్రకారం ప్రమోషన్ ద్వారా లభించే అదనపు ఆర్థిక ప్రయోజనాలు కొత్త బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే వర్తించాలి. అలాగే 2010 ఫిబ్రవరి 20నాటి జీవో నంబర్ 14 ప్రకారం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద పదోన్నతుల సమ యంలో వేతన నిర్ణయం అమల్లో ఉన్న నిబంధనలకు అనుగుణంగా ఉండాలి. అయితే కొంతమందికి అర్హత వచ్చిన తేదీ నుంచే కొత్త హోదా ప్రకారం వేతనాలు నిర్ణయించినట్లు ఆడిట్ పరిశీలనలో గుర్తించారు. ఈ కారణంగా ఆ తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించే వరకు చెల్లించిన అదనపు మొత్తాలను తిరిగి రికవరీ చేయా లని సూచించారు. ఇదే విషయాన్ని సీబీఐకి ఇచ్చిన ఫిర్యా దులో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టరాజ్యంగా లూటీ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

30 మందికి రూ. 52.88 లక్షలు!

ఈ వ్యవహారంలో బయటపడిన మొత్తం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆడిట్ నివేదిక ప్రకారం అదనంగా చెల్లించిన మొత్తం రూ.52.89 లక్షలు. సం బంధిత ఉద్యోగుల పేర్లు, హోదాలు, అర్హత తేదీలు, బాధ్యతలు స్వీకరించిన తేదీలు, తిరిగి వసూలు చేయా ల్సిన మొత్తాలను ప్రత్యేక పట్టికలో పొందుపరిచారు. ఇందులో కొంతమంది ప్రొఫెసర్లకు రూ.4లక్షల నుం చి రూ.8 లక్షలకు పైగా మొత్తాలు కనిపిస్తున్నాయి. ఒక ప్రొఫెసర్ పేరుతో అత్యధికంగా రూ.8,24,330 రికవరీ చూపించారు. ఉద్యోగుల అర్హత తేదీకి, కొత్త బాధ్యతలు చేపట్టిన తేదీకి మధ్య ఉన్న వ్యవధిని బట్టి ఈ మొత్తం మారుతోంది. కొన్ని కేసుల్లో నెలల వ్యవధి ఉండగా,మరికొన్ని కేసుల్లో సంవత్సరాల వ్యత్యాసం ఉంది.ఈ వ్యవధిలో కొత్త హోదాకు సంబంధించిన అదనపు వేతనాలు చెల్లించడమే రికవరీ భారం పెరగడానికి కారణమని ఆడిట్ నివేదిక పేర్కొంది.

తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

ఇక్కడే అసలు ప్రశ్నలు మొదలవుతున్నాయి. ఉద్యో గులకు ప్రమోషన్ ఇచ్చే ప్రక్రియను నిర్వహించింది ఎవరు? వారి అర్హతలను పరిశీలించింది ఎవరు? కొత్త హోదాకు సంబంధించిన వేతనాలను నిర్ణ యించింది ఎవరు? లక్షల రూపాయల బకాయిల బిల్లులను పరిశీ లించి చెల్లింపులకు అనుమతి ఇచ్చింది ఎవరు? ఇవ న్నీ విశ్వవిద్యాలయ అధికారిక వ్యవస్థలో జరగాల్సిన ప్రక్రియలే. ఉద్యోగులు తమకు అర్హత ఉందని భావిం చి అధికారుల నిర్ణయం ప్రకారం జీతాలు తీసుకున్నా రా? లేక నిబంధనలను పక్కనపెట్టి అధికారులు వేతన ప్రయోజనాలు కల్పించారా? ఆడిట్ అభ్యంతరం అదనపు చెల్లింపులపై ఉన్నప్పటికీ, ఉద్యోగుల వ్యక్తిగత తప్పిదాన్ని నిర్ధారించినట్లు కనిపించడం లేదు. అలాంటప్పుడు ఉద్యోగుల నుంచే మొత్తం వసూలు చేయడం ఎంతవరకు సమంజసం? వేతన నిర్ణయాల్లో పాల్గొన్న అధికారులు, ఆమోదాలు తెలిపిన వారి బాధ్యతను కూడా తేల్చాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంపై సీబీఐకి ఆధారాలతో ఫిర్యాదు చేయడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆడిట్ ఆదేశాలు.. మరిన్ని కేసులపైనా పరిశీలన!

ఆడిట్ అధికారులు కేవలం రూ.52.88 లక్షలు వసూలు చేయాలని చెప్పి ఆగిపోలేదు. ఇదే తరహాలో మరికొన్ని పదోన్నతుల కేసుల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా వేతన ప్రయోజనాలు కల్పించారా అని పరిశీలించాలని సూచించారు. అదనంగా చెల్లించిన మొత్తాలను ప్రభుత్వ సాధారణ నిధికి జమ చేయడంతోపాటు, తీసుకున్న చర్యల వివరాలను ఆడిట్ విభాగానికి తెలియజేయాలని పేర్కొన్నారు. ఉద్యోగుల వేతనాలను కూడా నోషనల్ పద్ధతిలో నిబంధనలకు అనుగుణంగా తిరిగి నిర్ణయించాలని సూచించారు. అదనపు ఆర్థిక ప్రయోజనాలను కొత్త బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచే లెక్కించాలి. ఈ చర్యలను తదుపరి స్థానిక ఆడిట్ తనిఖీలో పరిశీలించనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇప్పుడు విశ్వవిద్యాల య యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలానే ఉన్నా యి. నిబంధనలు ఉన్నప్పుడు వాటిని ఎందుకు పాటించలేదు? చెల్లింపులకు బాధ్యులైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుం టారు? ఉద్యోగులకు ముందుగా చెల్లించిన మొత్తాలను తిరిగి వసూలు చేయడమే పరిష్కారమా? లేక ఈ నిర్ణయాల వెనుక ఉన్న అధికారుల పాత్రను కూడా విచారిస్తారా? ప్రమోషన్లు ఉద్యోగులకు వరమా లేక అధికారుల తప్పిదాల వల్ల భారంగా మారాయా?



ఉద్యోగంలో ప్రమోషన్ వస్తే సహజంగానే ఆనందపడతారు. హోదా పెరుగుతుంది.. జీతం పెరుగుతుంది.. ఇన్నాళ్ల కష్టానికి గుర్తింపు లభించిందని భావిస్తారు. కానీ జేఎన్‌టీయూలో కొంతమంది ప్రొఫెసర్లకు మాత్రం ప్రమోషన్లు కొత్త సమస్యలు తెచ్చిపెట్టాయి. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన సుమారు 30 మందికి చెల్లించిన మొత్తాలపై ఇప్పుడు వివాదం మొదలైంది. అర్హత వచ్చిన తేదీ నుంచే కొత్త హోదాకు సంబంధించిన వేతనాలు, బకాయిలు చెల్లించడంపై ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా అదనంగా చెల్లించిన రూ.52,88,513ను సంబంధిత ఉద్యోగుల నుంచి తిరిగి వసూలు చేయాలని ఆదేశించారు. మరోవైపు ఈ వ్యవహారంలో జరిగిన చెల్లింపులపై ఆధారాలతో సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఇంతకీ ఈ డబ్బులు ఎవరి నిర్ణయంతో చెల్లించారు? నిబంధనలు తెలిసిన అధికారులు ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? ఉద్యోగుల నుంచి ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తే, చెల్లింపులకు అనుమతించిన అధికారుల బాధ్యత సంగతేంటి?
- సహనం వందే, హైదరాబాద్

బాసుల జీతం వంద రెట్లు అధికం

సీఈవోలు, ఉద్యోగుల మధ్య వేతనాల్లో భారీ అంతరం

- భారత కార్పొరేట్ హై లెవెల్ అధికారులకు కోట్లల్లో వేతనం
- ఉద్యోగులకు దక్కని ఫలం... పెద్దోళ్లకే ఆర్థిక ప్రయోజనం
- భారీగా పెరుగుతున్న 232 కంపెనీల బాసుల జీతాలు



భారత కార్పొరేట్ రంగంలో సీఈవోల వేతనాలు, సాధారణ ఉద్యోగుల సంపాదన మధ్య వ్యత్యాసం ఊహకందని విధంగా పెరుగుతోంది. ఒకే సంస్థలో పనిచేస్తున్నప్పటికీ, సంస్థలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ కొద్దిమంది ఉన్నతాధికారుల సంపద దూసుకుపోతుండగా, కష్టపడే సాధారణ ఉద్యోగుల వేతనాలు నత్తనడకన సాగుతున్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. - సహనం వందే, హైదరాబాద్

బీఎస్ఈ 500 సూచీలోని 232 కంపెనీల వార్షిక నివేదికలను పరిశీలించగా, దాదాపు సగం సంస్థల బాసుల వేతనం సగటు ఉద్యోగి సంపాదనకు వంద రెట్లకుపైగా ఉన్నట్లు తేలింది. 2020 ఆర్థిక సంవత్సరంలో 40 శాతంగా ఉన్న ఈ వాటా ఆరేళ్లలో మరింత పెరిగింది. 2024 ఆర్థిక సంవత్సరం నుంచి అధినేతల్లో ఎక్కువమంది సగటు ఉద్యోగి వేతనానికి కనీసం 80 రెట్లు పొందుతున్నారు.

కోట్లలో జీతం

కేవలం అధినేతలే కాకుండా 2026 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 7 శాతం పాలక మండలి సభ్యులు ఏడాదికి రూ. 10 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ పారితోషికం అందుకున్నారు. 2020లో ఇది కేవలం 3 శాతమే ఉండగా, ఆరేళ్లలో ఈ సంఖ్య రెండింతలకు మించి పెరిగింది. మరోవైపు ఏడాదికి కోటి రూపాయల కంటే తక్కువ పొందే డైరెక్టర్ల వాటా 76 శాతం నుంచి 70 శాతానికి పడిపోయింది. పెద్ద సంస్థల నిర్వహణలో సంక్లిష్టత, అంతర్జాతీయ వ్యాపార విస్తరణ, సాంకేతిక మార్పులు, ఏఐ వినియోగం వల్ల అనుభవజ్ఞులైన నాయకుల కోసం పోటీ పెరిగి ఈ భారీ వేతనాలకు దారితీస్తోంది.

పనితీరు పేరిట భారీ ప్రోత్సాహకాలు

2010 ప్రాంతంలో కంపెనీ అధినేతల మొత్తం పారితోషికంలో స్థిర వేతనం 70 నుంచి 80 శాతం వరకు ఉండేది. కానీ ఇప్పుడు పెద్ద కంపెనీల్లో వృత్తిపరమైన అధినేతల పారితోషికంలో కనీసం 60 శాతం వరకు కంపెనీ పనితీరుతో ముడిపడిన అదనపు మొత్తాలు, దీర్ఘకాలిక ప్రోత్సాహకాలే ఉంటున్నాయి. ఫలితంగా సంస్థకు మంచి ఫలితాలు వస్తే అధినేతల ఆదాయం వేగంగా పెరుగుతోంది.

లాభాలకు, జీతాలకు పొంతన లేదు

2026 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ 500 కంపెనీల డైరెక్టర్ల పారితోషికం అంతకుముందు ఏడాదితో పోలిస్తే 38 శాతం పెరగగా, నికర లాభాలు 22 శాతం మాత్రమే వృద్ధి చెందాయి. ఇదే సమయంలో సాధారణ ఉద్యోగుల వేతన వ్యయం కేవలం 1 శాతం మాత్రమే పెరిగింది. వేలాది మంది ఉద్యోగులకు జీతాలు పెంచితే సంస్థపై భారీ ఆర్థిక భారం పడుతుందని, అందుకే కీలక బాధ్యతలు నిర్వహించే కొద్దిమందికి అధిక పారితోషికం ఇస్తున్నామని కంపెనీలు వాదిస్తున్నాయి.

మారాల్సిన కార్పొరేట్ ఆలోచనా విధానం

అమెరికాలో 2025 ఆర్థిక విశ్లేషణల ప్రకారం ప్రధాన కార్యనిర్వా హకుల పారితోషికంలో 70 శాతానికిపైగా దీర్ఘకాలిక ప్రోత్సాహకాల రూపంలోనే ఉండటంపై వాటాదారులు, పెట్టుబడిదారులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఆర్థిక వృద్ధి మందగిస్తే లేదా కృత్రిమ మేధ కారణంగా ఖర్చులపై ఒత్తిడి పెరిగితే ఈ విధానాలు మారే అవకాశం ఉంది. కేవలం లాభాల రూపంలోనే కాకుండా ఉద్యోగుల సంక్షేమం, సంస్థలో న్యాయమైన వేతన విధానం ద్వారా కూడా కంపెనీ విజయాన్ని అంచనా వేయాల్సిన సమయం ఆసన్నమైంది.

చెత్త ఆహారం... కొత్త వ్యాపారం!

పారేయాల్సిన ఆహారం చౌకగా విక్రయం

- హైదరాబాద్‌లో యువకుల వినూత్న ప్రయోగం
- సర్‌ప్రైజ్ బ్యాగ్స్‌తో వృథాకు అడ్డుకట్ట
- వినియోగదారులు, వ్యాపారులకు ఇద్దరికీ లాభం
- ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న కొత్త ట్రెండ్



బేకరీలు, రెస్టారెంట్లలో రోజంతా అమ్మకాలు ముగిశాక మిగిలిపోయే కేకులు, బ్రెడ్లు, పఫ్‌లను మరుసటి రోజు అమ్మలేక నిర్వాహకులు చెత్తబుట్టలో పారేస్తుంటారు. అయితే ఇప్పుడు ఈ మిగులు ఆహారమే 'సర్‌ప్రైజ్ బ్యాగ్స్' పేరుతో కొత్త వ్యాపారానికి మార్గం చూపిస్తోంది. ప్రత్యేక మొబైల్ యాప్‌ల ద్వారా సమీపంలోని బేకరీలు, కేఫ్‌లలో మిగిలిన ఆహార సంచులను బుక్ చేసుకుని, ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాక వచ్చే కోడ్ చూపించి దుకాణంలో నేరుగా తీసుకోవచ్చు. ఏ దుకాణం నుంచి సంచి వస్తుందో తెలుస్తుంది కానీ, లోపల ఏయే పదార్థాలు ఉంటాయో ముందుగా తెలియకపోవడమే దీని ప్రత్యేకత. అసలు విలువలో కొన్నిసార్లు మూడో వంతు ధరకే నాణ్యమైన ఆహారం లభించడంతో పాటు, సంచిలో ఏముంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తోంది.
- సహనం వందే, హైదరాబాద్

విదేశాల్లో ప్రాచుర్యం పొందిన ఈ ఆలోచనను కరణ్ సింగ్ గుజ్రాల్, ఆదిత్య ఆర్య అనే ఇద్దరు స్నేహితులు 'రీప్లేట్' సంస్థ ద్వారా హైదరాబాద్‌లో ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఒక కాఫీ దుకాణంలో అమ్ముడుపోని క్రొసాంట్లు, మఫిన్లను పారేయడం చూసిన వీరు, 40కి పైగా బేకరీల నిర్వాహకులతో చర్చించి ఈ వేదికను రూపొందించారు. ప్రస్తుతం నగరంలోని బికనీర్‌వాలా, బేక్‌లోర్, బ్రౌన్ బేర్ సహా ఆరు బ్రాండ్లకు చెందిన 20 దుకాణాల ద్వారా రోజుకు సగటున 60, వారాంతాల్లో 75 సంచులను విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు 350కి పైగా సంచులను అందించి, సుమారు 300 కిలోల ఆహారం వృథా కాకుండా అడ్డుకున్నారు.

వ్యాపారులకు కొత్త కస్టమర్లా?

సగానికి సగం ధరకు ఆహారం ఇస్తే అసలు ధరకు కొనేవారు తగ్గుతారని బేకరీ నిర్వాహకులు మొదట్లో సందేహించారు. కానీ, ఈ సంచుల ద్వారా తమ దుకాణం రుచి చూసిన కొత్త వినియోగదారులు, ఆ తర్వాత సాధారణ ధరలకు కూడా కొనుగోలు చేసే రెగ్యులర్ కస్టమర్లుగా మారుతున్నారని రీప్లేట్ అనుభవం నిరూపించింది. మరోవైపు 2015లో డెన్మార్క్‌లో మొదలైన 'టూ గుడ్ టు గో', 'ఫ్లెష్‌ఫుడ్', 'కర్మ' వంటి అంతర్జాతీయ సంస్థలు యూరప్, ఉత్తర అమెరికాల్లో ఇదే తరహా సేవలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. భవిష్యత్తులో రీప్లేట్ కూడా హోటళ్లు, రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లకు తన సేవలను విస్తరించే ప్రణాళికలో ఉంది.

ఆహార భద్రతే అసలైన పరీక్ష!

అమ్ముడుపోని ఆహారం అంటే పాడైపోయినది కానప్పటికీ, వినియోగదారుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదు. ఆహారం ఎప్పుడు తయారైంది, ఎంతసేపటిలోపు తినాలి, ఎలా నిల్వ చేశారనే స్పష్టమైన వివరాలు యాప్‌లో ఉండాలి. ముఖ్యంగా పాలు, క్రీమ్, మాంసం వంటి త్వరగా పాడయ్యే పదార్థాల విషయంలో అప్రమత్తత అవసరం. అలాగే, ఆహార అలర్జీలు ఉన్నవారి కోసం సంచిలోని పదార్థాలపై కనీస సమాచారం అందించడం వల్ల వ్యాపార సంస్థలపై వినియోగదారులకు నమ్మకం పెరుగుతుంది.

మూడు ప్రయోజనాల సమాహారం!

ఒకప్పుడు చెత్తబుట్టలోకి వెళ్లిపోయిన ఆహారం నేడు వ్యాపారులకు అదనపు ఆదాయాన్ని, వినియోగదారులకు చౌకగా రుచికరమైన భోజనాన్ని అందిస్తూ పర్యావరణానికి మేలు చేస్తోంది. ఒకవైపు ఆహార కొరత, మరోవైపు భారీగా ఆహార వృథా జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ రెండింటి మధ్య అంతరాన్ని తగ్గించడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరం. హైదరాబాద్‌లో మొదలైన ఈ ప్రయత్నం దేశంలోని మరిన్ని నగరాలకు విస్తరిస్తే ఆహార వృథా నివారణలో ఒక కొత్త విప్లవం రావడం ఖాయం.